సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 18 । మే । 2025

చలో.. చెన్నూర్!



మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు నిలయం. అగస్త్య మహాముని నడయాడిన నేల. దుర్వాస మహర్షి కొలిచిన లక్ష్మీ నారసింహుడు ఇక్కడే కొలువై ఉన్నాడు. గోదావరి తీరంలో కోటి లింగాలు ఉన్నాయి. 8లో▸



నాయబ్ తహసీల్దార్ల బదిలీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న 14 మంది నాయబ్ తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పైలెట్ ప్రజావాణిలో అందించే అర్జీలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, తలమడుగు, జైనథ్ మండలాల జీఆర్‌వోలు, జిల్లాస్థాయి, ప్రత్యేక అధికారులు, గ్యాస్ డీలర్లతో పైలెట్ ప్రజావాణి అమలుపై సమీక్ష నిర్వహించారు. అందుతున్న అర్జీలు, పరిష్కారానికి చేపట్టిన చర్యలపై మండలాల వారీగా సమీక్షించారు. గ్యాస్ సబ్సిడీ, రుణమాఫీ, పింఛన్, గృహజ్యోతి అంశాలపైనే అధిక ఫిర్యాదులు అందుతున్నట్లుగా సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తూ బాధితుల సమస్యలు సత్వరం పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వినోద్‌కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీఎస్‌వో వాజీద్‌అలీ పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం పరిశీలన

జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలను భద్రపర్చిన గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం సందర్శించారు. నెలవారి సందర్శనలో భాగంగా స్ట్రాంగ్‌రూంలోని ఈవీఎంలను పరిశీలించారు. భద్రత సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాథోడ్ పంచపూల తదితరులున్నారు.

పోలీసులకు స్థానికంగానే ఆరోగ్య భద్రత సేవలు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య భద్రత కింద వైద్య సేవలు పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వారికి స్థానికంగానే జిల్లా కేంద్రంలోని నక్షత్ర హాస్పిటల్‌లో వైద్య సేవలను శనివారం ఆయన ప్రారంభించారు. సేవల ధ్రువీకరణ పత్రాన్ని ఆసుపత్రి వైద్యుడికి అందజేశారు. పోలీస్ సిబ్బంది ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో వైద్యులు సందీప్ ఐత్వర్, శిల్ప ఆకెర, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఒకటో పట్టణ సీఐ సునీల్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు సీజ్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని అధికారులు శనివారం సీజ్ చేశారు. కాలనీకి చెందిన నయిం తన స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టాడని అదే కాలనీకి చెందిన కన్నయ్యలాల్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని నిలిపివేయాలని సదరు వ్యక్తికి బల్దియా అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయిన పట్టించుకోకుండా పనులు కొనసాగించాడు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. పనులను తక్షణమే నిలిపివేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అయినా పనులు కొనసాగించడంతో కలెక్టర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ సిబ్బందితో కాలనీకి వెళ్లి నిర్మాణంలో ఉన్న భవనాన్ని సీజ్ చేశారు. వారి వెంట టీపీవో సుమలత, టీపీఎస్ నవీన్ కుమార్, టీపీబీవో సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

సండే స్పెషల్

పేరు.. తెచ్చే

నేమ్ విత్ సంథింగ్ స్పెషల్

- ఇంటిపేరు కన్నా పనితోనే గుర్తింపు
- ప్రత్యేకత చాటుకుంటున్న పలువురు

సమాజంలో ప్రతీ ఒక్కరికి ఓ పేరు ఉంటుంది. ఇందులో ఇంటి పేరును వ్యక్తి పేరు అనుసరిస్తుంది. కొందరికి మాత్రం తమ వృత్తి, ప్రవృత్తి, మర్చిపోలేని ఘటనలతో వచ్చే గుర్తింపు శాశ్వతమవుతోంది. అది ఏకంగా తమ ఇంటిపేరు స్థానంలో నిలిచిపోతుంది. వారికి ఆ పేరుతోనే ప్రత్యేకత లభిస్తోంది. జిల్లాలో ఇలాంటి వారిపై ఓ లుక్కేద్దామా మరి. – ఆదిలాబాద్



టైలర్.. అశోక్

పట్టణంలోని కోలీపురా కాలనీకి చెందిన రామగిరి అశోక్ 40ఏళ్లగా టైలరింగ్ వృత్తిలో ఉన్నాడు. జిల్లా కేంద్రంలోని ఎంతోమంది వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, న్యాయవాదులు ఈయనను టైలర్ అశోక్‌గా గానే గుర్తుపడతారు. అశోక్ రోడ్ ప్రాంతంలో టైలరింగ్ చేసే ఇతడు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని వర్గాలకు సుపరిచితుడు. ఇంటి పేరు కన్నా దశాబ్దాలుగా చేస్తున్న వృత్తి పేరుతో గుర్తింపు రావడం సంతోషంగా ఉందంటున్నాడు ఇతడు.

తెలంగాణ కిరణ్



నేరడిగొండ మండలం కుమారి గ్రామానికి వెళ్లి కుంట కిరణ్ కుమార్‌రెడ్డి ఇల్లు ఎక్కడ అని అడిగితే గుర్తుపట్టేవారు తక్కువే. అదే తెలంగాణ కిరణ్ అంటే మాత్రం టక్కున చెబుతారు. గ్రామంలో ఈయన చిన్నప్పటినుంచి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. పలు నిరసన కార్యక్రమాల్లో ముందుండి నినదించాడు. ఈ క్రమంలోనే ఈయన పేరు కాస్తా తెలంగాణ కిరణ్‌గా మారిపోయింది. 2001 నుంచి 2014 వరకూ ఉద్యమంలో భాగస్వామ్యం అవ్వడమే తనకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని సంతోషంగా చెబుతున్నాడు కిరణ్‌కుమార్‌రెడ్డి.

ఫ్లెక్సీ.. హన్మాండ్లు



జిల్లా కేంద్రంలోని తిరుపెల్లి కాలనీకి చెందిన బొంపెల్లి హన్మాండ్లు 1987లో పెయింటర్‌గా పనులు చేయడం ప్రారంభించాడు. వివిధ హోర్డింగులు వేయడం, అందమైన బొమ్మలు గీస్తూ మంచి పెయింటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2011లో జిల్లాలోనే మొదటిసారిగా ఫ్లెక్సీ షాపు ప్రారంభించాడు. అప్పటినుంచి అతడి పేరు కాస్తా ఫ్లెక్సీ హన్మాండ్లుగా స్థిర పడిపోయింది. ఇంటి పేరు కంటే నమ్ముకున్న వృత్తితో గుర్తింపు రావడం ఆనందంగా ఉందని అంటున్నాడు హన్మాండ్లు.

మెడికల్ స్వామి..



ఆదిలాబాద్‌లో డాక్టర్ నారాయణరెడ్డి ఐ హాస్పిటల్ అంటే తెలియని వారు ఉండరు. అదే ఆస్పత్రిలో మెడికల్ సెక్షన్లో 33 ఏళ్లగా పనిచేస్తున్న బోనగిరి స్వామి అలియాస్ మెడికల్ స్వామి అందరికీ సుపరిచితుడు. తాంసి మండలం జామిడి గ్రామానికి చెందిన స్వామిని ఆదిలాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు మెడికల్ స్వామిగానే గుర్తు పడుతుంటారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు చదివింపుల్లో మెడికల్ స్వామి అని రాస్తేనే తనను గుర్తుపడతారని చెబుతున్నాడు స్వామి.

బోరింగ్ గంగారాం



ఇచ్చోడ: ఇతడి అసలు పేరు బొంగురాల గంగారాం. ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్. వ్యవసాయం చేస్తుంటాడు. కొన్నేళ్ల క్రితం ఇతడి ఇంటి ముందు ప్రభుత్వ నిధులతో బోరింగ్ వేశారు. అప్పటి నుంచి ఇతడిని ఊళ్లో అంతా బోరింగ్ గంగారాంగా పిలవడం మొదలు పెట్టారు. తనను ఇంటి పేరుతో కాకుండా బోరింగ్ గంగారాం అంటేనే గుర్తుపడతారని అంటున్నాడు ఇతడు.

మండల్ పాషా



ఇచ్చోడ: ఇక్కడ కనిపిస్తున్నది మహ్మద్ పాషా. ఇచ్చోడ మండలకేంద్రం. ఇతను రెవెన్యూ కార్యాలయంలో 30 ఏళ్లగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే మండల కేంద్రంలో చాలామంది పాషాలు ఉండటంతో ఇతడిని అంతా మండల్ పాషాగా పిలుస్తుంటారు. మూడు దశాబ్దాలుగా తనను ఈ పేరుతోనే గుర్తుపడతారని అంటున్నాడు పాషా.

హోటల్ మల్లేశ్



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన రుద్రారపు మల్లేశ్ దశాబ్దాలుగా హోటల్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఏళ్లగా ఇదే పనిచేస్తున్న ఇతడిని ఇంటిపేరు చెబితే ఎక్కువ మంది గుర్తుపట్టరు. అదే హోటల్ మల్లేశ్ అంటే మాత్రం టక్కున చెప్పేస్తారు. తన తండ్రి చాలాకాలం హోటల్ నడిపాడని, తానూ అదే కొనసాగిస్తుండడంతో ఆ పేరు కాస్త ఇంటిపేరుగా మారిందని అంటున్నాడు మల్లేశ్.

కూరగాయల పోశెట్టి



తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన పాముల పోశెట్టి 35 ఏళ్లగా కూరగాయలు సాగుచేస్తున్నాడు. వాటిని ప్రతిరోజు ఉదయాన్నే జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌కు తీసుకువచ్చి విక్రయిస్తాడు. దశాబ్దాలుగా ఇదే పని చేస్తుండడంతో ఇతడిని కూరగాయల పోశెట్టిగా పిలుస్తుంటారు స్థానికులు. తన ఇంటిపేరు చాలా మందికి తెలియదని కూరగాయల పోశెట్టి అంటేనే గుర్తుపడతారని అంటున్నాడు ఇతడు.

బడి బాటలో బుక్స్

- జిల్లాకు చేరిన 84 శాతం పాఠ్యపుస్తకాలు
- మండల పాయింట్లకు సరఫరా షురూ



పాఠ్యపుస్తకాల సరఫరా ప్రక్రియ ప్రారంభిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. బడులు తెరిచే నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠ్యపుస్తకాల సరఫరా సైతం ప్రారంభించారు. అయితే పూర్తిస్థాయిలో ఇంకా జిల్లాకు చేరుకోలేదు. మరాఠీమీడియం పుస్తకాలు ఒక్కటి కూడా రాకపోగా , హిందీ మీడియంకు సంబంధించి లాంగ్వేజ్ పుస్తకాలు మాత్రమే వచ్చాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అప్పటి వరకు అన్ని తరగతులకు సంబంధించిన పుస్తకాలు అందించేలా చర్యలు చేపడుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తోంది. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు సైతం బడులు తెరిచే రోజు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో హైదరాబాద్ పాఠ్యపుస్తకాల ప్రింటింగ్ ప్రెస్ నుంచి జిల్లాకు సరఫరా చేస్తుంది. జిల్లా కేంద్రంలో మూడు గోదాములు ఏర్పాటు చేసి వాటిని భద్రపర్చారు. వాటిని ప్రస్తుతం మండల పాయింట్లకు చేరవేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని కేజీబీవీలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేయగా ఆదివారం నుంచి మోడల్ స్కూళ్లకు ఈ ప్రక్రియ షురూ చేయనున్నారు. మరో రెండు రోజుల తర్వాత మండలాల వారీగా అందించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే వీటిని ట్రాన్స్‌పోర్టు చేసేందుకు నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు అయోమయంలో ఉన్నారు. రవాణా చార్జీలను పాఠ్యపుస్తకాల సరఫరా ఇన్‌చార్జి వెచ్చించి స్కూళ్లకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు.

జిల్లాకు చేరిన 84శాతం పాఠ్యపుస్తకాలు

జిల్లాలో ప్రైవేట్ మినహా మిగతా అన్ని యాజమాన్యాలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఇప్పటివరకు జిల్లాకు చేరుకున్న పాఠ్యపుస్తకాలను స్థానిక ఆర్‌వీఎం గోదాం, మార్కెట్ యార్డు, పాలశీతలీకరణ కేంద్రాల్లో భద్రపర్చారు. ఇంకా 77,410 వేల పుస్తకాలు రావాల్సిఉంది. మరో 24 రోజుల వరకు గడువు ఉంది. జిల్లా కేంద్రంలో భద్రపర్చిన పుస్తకాలను ప్రస్తుతం ఆయా మండలాల ఎమ్మార్సీలకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేస్తున్నారు. వీటికి గాను రూ.3లక్షల 50వేల వరకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు అవసరం కాగా, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు.ఎంఈవోలు, పాఠ్యపుస్తకాల గోదాం ఇన్‌చార్జీలు ఈ చార్జీలు భరిస్తున్నట్లుగా తెలుస్తోంది. నిధులు వచ్చిన తర్వాత వారికి బిల్లులు అందించనున్నట్లు సమాచారం.

చేరుకున్న పార్ట్–1 పుస్తకాలు

ప్రస్తుతం పాఠ్యపుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరో పక్క ఇంగ్లీష్‌లో పాఠాలను ముద్రించారు. ఆంగ్ల మాధ్యమం అమలు చేయడంతో పార్ట్–1, పార్ట్–2గా విభజించి అందిస్తున్నారు. ప్రస్తుతం పార్ట్–1 పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, పార్ట్–2 బుక్స్ ఆగస్టు, సెప్టెంబర్ వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని విభజించడం ద్వారా పుస్తకాల బరువు కూడా తగ్గింది. అయితే రెండేళ్లగా విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ కూడా పంపిణీ చేస్తున్నారు. ఇది వరకు పాఠ్య పుస్తకాల గోదాం నుంచే వీటిని సరఫరా చేయగా ఈ ఏడాది హైదరాబాద్ నుంచి నేరుగా పాఠశాలలకే సరఫరా అవుతున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఉన్నత తరగతులకు నోట్ బుక్స్ పంపిణీ చేయగా, ఈ సారి ప్రాథమిక తరగతులకు సైతం పంపిణీ చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.

జిల్లాలో..
మొత్తం పాఠశాలలు : 1,439
కావాల్సిన పాఠ్యపుస్తకాలు : 4,83,110
ఇప్పటివరకు చేరుకున్నవి : 4,05,700
ఇంకా రావాల్సినవి : 77,410

చేరని హిందీ, మరాఠీ మీడియం బుక్స్

జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో 81,151 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియాలకు సంబంధించిన పుస్తకాలు 84శాతం వరకు చేరుకోగా, మరాఠీ మీడియంకు సంబంధించి ఏ ఒక్క తరగతికి పుస్తకాలు రాలేదు. హిందీ మీడియంలో కేవలం ఫస్ట్ లాంగ్వేజ్ పుస్తకాలు మాత్రమే వచ్చాయి. అలాగే మూడో తరగతి ఇంగ్లీష్, ఈవీఎస్ (ఇంగ్లీష్ మీడియం), నాల్గో తరగతి తెలుగు, ఆరో తరగతి గణితం (తెలుగు మీడియం), 7,8,9వ తరగతుల హిందీ, పదో తరగతి సాంఘిక శాస్త్రం, గణితం (ఇంగ్లీష్ మీడియం) పుస్తకాలు రాలేదు. అయితే బడులు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు సరఫరా అవుతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పాఠ్య పుస్తకాల సరఫరా ప్రారంభించాం

జిల్లాకు 84శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇప్పటికే కేజీబీవీలకు సరఫరా చేశాం. మోడల్ స్కూళ్లకు సరఫరా చేస్తున్నాం. మరో రెండు రోజుల్లో మండలాల పాయింట్లకు పుస్తకాలను పంపిస్తాం. బడిబాట కార్యక్రమానికి ముందుగానే బుక్స్ చేరవేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. హిందీ, మరాఠీ మీడియం పుస్తకాలు జిల్లాకు చేరాల్సి ఉంది.

– ఎస్. సత్యనారాయణ, పాఠ్యపుస్తకాల మేనేజర్, ఆదిలాబాద్

ముందస్తు చర్యలు చేపట్టాలి

- రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్
- ప్రకృతి వైపరీత్యాలపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న అరవింద్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవీటీజీ, వరద ముంపు ప్రభావిత ప్రాంతాలపై ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్‌కలెక్టర్ యువరాజ్‌తో కలిసి సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకుంటున్న చర్యలను అడిగితెలుసుకున్నారు. గతంలో వరద ప్రభావిత ప్రాంతా ల్లో దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్ల మరమ్మతులు, నిధులు కేటాయింపు, నిర్మాణ పనుల వివరాలపై ఆరా తీశారు. ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

అరవింద్ కుమార్‌కు స్వాగతం పలికిన కలెక్టర్

కైలాస్‌నగర్: రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ శనివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆర్డీవో వినోద్ కుమార్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో వేసవి వడగాలుల తీవ్రతను నియంత్రించేందుకు చేపట్టిన చర్యలపై కలెక్టర్ ముఖ్య కార్యదర్శికి వివరించారు.

కేసుల దర్యాప్తులో ప్రమాణాలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: కేసుల దర్యాప్తు, పరిశోధనలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. కోర్టుల్లో శిక్షల శాతం పెంచేలా దర్యాప్తు పరిశోధన నిర్వహించే అధికారులు, రైటర్లకు పీపీ ద్వారా శనివారం ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి స్టేషన్, సీఐ ఆఫీస్ రైటర్లు, సీసీటీఎన్ఎస్, కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొనగా.. ఎస్‌హెచ్‌వోలు, సీఐలు, పోలీసు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సరైన దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసే క్రమంలో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇందులో పీపీ నవీన్‌కుమార్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి,డీసీఆర్‌బీ ఎస్సై మహేందర్‌పాల్గొన్నారు.

తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వాట్సాప్, టెలీగ్రాం, సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే ఫైల్స్ ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశముంటుందన్నారు. అప్రమత్తతోనే వాటిని అడ్డుకోవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లైతే వెంటనే 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. గడిచిన వారంలో జిల్లా వ్యాప్తంగా 15 ఫిర్యాదులు అందాయన్నారు.

అకాల వర్షం.. ఆగమాగం

- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
- తడిసిన వరి ధాన్యం, జొన్నలు
- రైతులకు తీవ్ర ఇబ్బందులు



ఉట్నూర్‌లో తడిసిన వరిధాన్యం



తాంసిలో తడిసిన జొన్న సంచులు

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి/జైనథ్/తాంసి/ఉట్నూర్‌రూరల్: జిల్లాలో పలు మండలాల్లో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురిసింది. ఈదురుగాలులు తోడవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇంటిపైకప్పులు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు.

జిల్లాలో 12.2 మి.మీ. వర్షం

జిల్లాలో 12.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. సాయంత్రం 6నుంచి రాత్రి 10 గంటల వరకు వర్షం కురిసింది. ఇంద్రవెల్లి ఏరియాలో 28 విద్యుత్‌స్తంభాలు పడిపోయాయి. అలాగే ఉట్నూర్‌లో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరగగా మూడు కండక్టర్లు కాలిపోయాయి. విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఆయా ప్రాంతాలను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేశారు. అలాగే ఇంద్రవెల్లి, జైనథ్, ఉట్నూర్, బేల, సాత్నాల, ఇచ్చోడ తదితర కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు తెచ్చిన జొన్న పంట తడిసింది. దీంతో రైతులు వాటిని ఆరబెట్టారు.

- ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడిపోయాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డీఈ సుభాష్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మండలంలోని కేస్లాగూడలో వెడ్మ అంబాజీ, ధర్మసాగర్‌లో గోతి సర్దార్, సాబ్లే జైత్రం, సాబ్లే లాల్‌సింగ్, గోతి సైనాబాయి, శ్యామ్‌రావ్, నాథ్‌సింగ్, రాజేందర్‌కు చెందిన ఇళ్ల పైకప్పులుదెబ్బతిన్నాయి. తమకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.
- జైనథ్, తాంసి మండలకేంద్రాల్లో మార్కెట్ యార్డులకు తీసుకువచ్చిన జొన్నలు వర్షానికి తడిసిపోయాయి. రైతులు టార్పాలిన్లు కప్పినా తడిసిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.



ఉట్నూర్‌లో విద్యుత్ వైర్లపై పడ్డ చెట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్



ధర్మసాగర్‌లో ఊడిపోయిన ఇంటి పైకప్పు రేకులు

- ఉట్నూర్ మండలకేంద్రంలోని గంగన్నపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి ధాన్యం కొంతమేర తడిసింది. విషయం తెలుసుకున్న ఏపీడీ గోవింద్‌రావు అక్కడికి చేరుకొని ధాన్యాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో మెకానిక్ షాప్ దగ్ధం

దహెగాం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని బైక్ మెకానిక్ షాపు దగ్ధమైంది. బాధితుడు తుశార్ తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం షెటర్‌కు తాళం వేసి భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలు ఆర్పివేశామన్నారు. అప్పటికే సామగ్రి కాలిపోయిందన్నారు. ఘటనలో సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

పిడుగుపాటుకు గుడిసె..

భీమారం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో దాసరి కిష్టయ్యకు చెందిన గుడిసెపై శుక్రవారం రాత్రి పిడుగు పడడంతో దగ్ధమైంది. రాత్రి భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో తాము పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో పడుకున్నామని కిష్టయ్య తెలిపారు. అర్ధరాత్రి పిడుగు వేసిన శబ్దం వినిపించి బయటకు రావడంతో గుడిసెలో మంటలు చెలరేగాయన్నారు. అతికష్టం మీద ఇంట్లో ఉన్న సిలిండర్ బయటకు తెచ్చామన్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రిజ్, సామగ్రి, బట్టలు కాలిపోయాయన్నారు. ఘటలనో సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నాడు.

వ్యాన్ ఢీకొని మహిళకు గాయాలు

మామడ: మినీ వ్యాన్ ఢీకొట్టడంతో మహిళకు గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కొరిటికల్ గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మి శుక్రవారం రాత్రి ఇంటిబయట మంచంపై పడుకుని ఉంది. సమీపంలోని కిరాణ దుకాణంలో ఐస్‌క్రీమ్ దించేందుకు వచ్చిన వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా నడపడటంతో లక్ష్మి నిద్రిస్తున్న మంచాన్ని ఢీకొట్టింది. మహిళకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి మృతికి కారకుడైన యువకుడి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: ఒకరిపై దాడిచేసి అతని మృతికి కారకుడైన యువకుడిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఊరడి లక్ష్మణ్, ఊరడి లచ్చయ్య మధ్య నాలుగు గుంటల భూమి విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. లక్ష్మణ్ ఈ నెల 8న లచ్చయ్య ఇంటికి వెళ్లి భూమి విషయం మాట్లాడుతుండగా లచ్చయ్య కుమారుడు ఊరడి శంకర్ అతనిపై దాడికి పాల్పడ్డాడు. రాత్రి కడుపులో నొప్పి వస్తుందనడంతో లక్ష్మణ్ కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా ఈనెల 13న మృతి చెందాడు. మృతుని కుమారుడు రమేశ్ తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ వివరించారు. ఎస్సై సీహెచ్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో.. చెన్నూర్!

- ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు నిలయం..
- అగస్త్య మహాముని నడయాడిన నేల
- దుర్వాస మహర్షి కొలిచిన లక్ష్మీనారసింహుడు..
- కోటి లింగాలు వెలిసిన గోదావరి తీరం..
- తిలకించి.. పులకించాల్సిందే..



అక్కెపల్లి వాగులో బండకు వెలిసిన లక్ష్మీనరసింహస్వామి



కత్తెరసాలలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం


చెన్నూర్‌రూరల్: భక్తుల కొంగు బంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా పేరున్న శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని కత్తెరసాల గ్రామంలో ఉంది. చెన్నూర్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఎంతో ప్రాసస్త్యం ఉంది. అగస్త్య మహాముని ఇక్కడ శివపార్వతులకు పూజలు చేసే వారని పురాణంలో ఉంది. ఇక్కడ వెలిసిన మల్లికార్జున స్వామి, భ్రమరాంభిక విగ్రహాలకు కాకతీయ మహారాజులు పరిపాలించే కాలంలోనే ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఏటా మహా శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం, మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. జాతరకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఒగ్గు పూజారులు ఒగ్గు కథలు, పట్నాలతో మల్లన్న స్వామికి బోనాలు సమర్పిస్తారు. ఏడాది పొడవునా ప్రతీ బుధ, ఆది వారాల్లో ఇతర ప్రాంతాల భక్తులు వచ్చి ఇక్కడ బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు.

ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లు కోటిలింగాలు

సహజ సిద్ధంగా బండరాళ్లకు వెలిసిన కోటిలింగాలు ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. పురాతన కాలం నాటి ఈ కోటి లింగాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. కత్తెరసాల నుంచి మూడు కిలోమీటర్లు, చెన్నూర్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో నారాయణపూర్ గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున వెలిసాయి. సుమారు 1800ల ఏళ్ల క్రితమే ఈ కోటిలింగాలు వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ కోటిలింగేశ్వర ఆలయం ఉన్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి. ఇక్కడ ఉన్న బండరాళ్లపై వివిధ రకాల దేవతామూర్తులు కొలువు దీరారు. పార్వతి కొల్లుకుంట, పాయిరాల కొలను, యమకోనం, వినాయక విగ్రహాలు, నందిపాదం, శివలింగం, శివుని ఆత్మలింగాలు, పార్వతి, నంది గుర్తులు ఇక్కడ దర్శనమిస్తాయి. అగస్త్య మహాముని కత్తెరసాలలోని మల్లికార్జునస్వామి ఆలయం నుంచి సొరంగ మార్గం ద్వారా కోటిలింగాలకు వెళ్లి అక్కడ గోదావరి నదిలో స్నానమాచరించి తిరిగి కత్తెరసాలకు వెళ్లి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించేవారని కాళేశ్వర ఖండం చెబుతోంది. కాకతీయులు పరిపాలించే కాలంలో రాజులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేసేవారని స్థల పురాణంలో ఉంది.



నారాయణపూర్‌లో గోదావరి ఒడ్డున వెలిసిన కోటిలింగాలు



కోటిలింగాల వద్ద ఉన్న కొల్లుకుంట

చరిత్ర గొప్పది



చెన్నూర్ చరిత్ర ఎంతో గొప్పది. మునులు, ఋషులు నడయాడిన నేల ఇది. కత్తెరసాలలో మల్లికార్జున స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. నారాయణపూర్ సమీపంలోని కోటిలింగాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అక్కెపల్లి లక్ష్మీనారసింహుడు స్వయంభుగా బండకు వెలిశాడు. దుర్వాస మహర్షి ఇక్కడ పూజలు చేసే వారని కాళేశ్వర ఖండం చెబుతోంది.

– హిమాకర్ శర్మ, వేద పండితుడు, శివాలయం

లోక రక్షణకోసం దుర్వాస మహర్షి తపస్సు..

చెన్నూర్ మండలంలోని అక్కెపల్లిలో దుర్వాస మహర్షి లోక రక్షణ కోసం ఘోర తపస్సు చేసి లక్ష్మీనారసింహుడిని ప్రసన్నం చేసుకున్నాడని, అనంతరం నరసింహస్వామిని ఇక్కడ ప్రతిష్ఠించాడని కాళేశ్వర ఖండం చెబుతోంది. ఇక్కడ వెలిసిన నారసింహుడు సర్పాకారంలో వెలిసిన అత్యంత మహిమాన్వితుడిగా పేర్కొంటారు. నారసింహుడు అక్కెపల్లి నుండి కాళేశ్వరం వరకు విస్తరించి ఉన్నాడని పూర్వీకుల నమ్మకం. పూర్వం ప్రజలు కాళేశ్వరం నుండి బయలు దేరి గోదావరిలో స్నానమాచరించి వివిధ క్షేత్రములు తిరిగి లోక రక్షకుడైన నారసింహుడుని దర్శించుకునేవారు. చెన్నూర్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. కానీ ఎంతో చరిత్ర ఉన్న ఈ ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పటిక, బెల్లం, నిందితుడితో అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ నుంచి మామాడ మండలం వెంకటాపూర్‌కు ద్విచక్రవాహనంపై నల్లబెల్లం, పటిక తరలిస్తున్న సాయిబాబాను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల దుకాణం నుంచి తరలిస్తున్నట్లు గుర్తించారు. దుకాణం యజమాని రఫీకాన్, సిబ్బంది రంజిత్‌తో పాటు సాయిబాబాపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు, సిబ్బంది గౌతమ్, రవీందర్, కల్పనా, సాయి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేసిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో రెండు రోజుల క్రితం ప్రయాణికులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని తిర్పెల్లికి చెందిన కాసిప్, భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన జహీర్ రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న వ్యక్తులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

అడేగామ(కే)లో చోరీ

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కే)లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. గ్రామానికి చెందిన కుంబోజి నారాయణ ఇంటికి తాళం వేసి ఆదిలాబాద్ మండలంలోని జైనథ్ వెళ్లాడు. గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.2.50 లక్షలతో పాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

లక్ష్మణచాంద: మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆలుగొట్టు పెద్ద గంగన్న (61)కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం అతని భార్య లక్ష్మితో గొడవపడగా కూతురు ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



గంగన్న (ఫైల్)

మద్యానికి బానిసై ఒకరు..

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఈ.సాయన్న తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని భీంనగర్‌కు చెందిన కాంబ్లే రాజు (46) కొంతకాలంగా మద్యానికి బానియ్యాడు. శుక్రవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. శనివారం ఉదయం ఓ రైతు పంటచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన మేకల కాపరి గిరి దత్తాత్రేయ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుని భార్య కాంబ్లే లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజు (ఫైల్)

డిగ్రీ విద్యార్థిని..

మందమర్రిరూరల్: ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మామిడిగట్టు గ్రామానికి చెందిన దుర్గం సాత్విక (19) మంచిర్యాలలోని సీవీ రామన్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం పరీక్షకు వెళ్లి ఇంటికి వచ్చింది. సాయంత్రం నల్లా వస్తుండడంతో చెప్పేందుకు వెళ్లగా తలుపు మూసి ఉంది. సందులోంచి చూడగా దూలానికి ఉరేసుకుని కనిపించింది. ఇదిలా ఉండగా శుక్రవారం సాత్విక తండ్రి వెంకటేష్ విష రసాయనం సేవించగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం సాత్విక తన తండ్రిని చూసి వచ్చినట్లు సమాచారం. మృతికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ విషయమై రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



సాత్విక (ఫైల్)

కొడుకు అంత్యక్రియలకు వెళ్తూ తండ్రి మృతి

బెల్లంపల్లి: కొడుకు అంత్యక్రియలకు వెళ్తూ తండ్రి మృతి చెందిన సంఘటన బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ నంబర్ 2 ఇంక్‌లైన్ బస్తీకి చెందిన బొమ్మ కుమార్ (60)కుమారుడు విజయ్‌కుమార్ (36) కొత్తగూడెంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం విజయ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుమార్ కారులో కొత్తగూడెం బయలుదేరాడు. మార్గమధ్యలో గుండెపోటు రావడంతో కారులోనే మృతి చెందాడు. కుమారుడి కడచూపు కోసం వెళ్తూ తండ్రి కూడా తిరిగిరాని లోకానికి వెళ్లడం అందరి హృదయాలను కలిచి వేసింది. ఒకరోజు వ్యవధిలో తండ్రీ కొడుకు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడి అంత్యక్రియలు కొత్తగూడెంలో, తండ్రి దహన సంస్కారాలు బెల్లంపల్లిలో నిర్వహించారు.



కుమార్ (ఫైల్)

టిప్పర్ ఢీకొని యువకుడు..

భైంసారూరల్: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ నైలు తెలిపిన వివరాల మేరకు కుభీర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన గంగాప్రసాద్ (21) శనివారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై భైంసాకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో భైంసా–కుభీర్ ప్రధాన రహదారిపై మిర్జాపూర్ గ్రామ సమీపంలో టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



గంగాప్రసాద్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో వ్యక్తి ..

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అంగడి బజార్‌కు చెందిన మన్నే సాంసన్ ప్రశాంత్ కుమార్ (45) శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నీటి కోసం ఇంట్లోని బావివద్దకు వెళ్లి కరెంట్ స్విచ్ ఆన్‌చేయగా నీళ్లు రాక పోవడంతో మోటర్‌కు కట్టిన జీఐ వైర్‌ను పట్టుకుని కదిలిస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుని సోదరి మన్నే సలోమి ప్రియదర్శిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రశాంత్ కుమార్ మృతదేహం

చికిత్స పొందుతూ ఒకరు ..

నర్సాపూర్ (జి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ ఇర్ఫాన్ అలీ (38) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ అలీ ఈ నెల 7న లారీలో ధాన్యం లోడును లోకేశ్వరం మండలం రైస్‌మిల్లులో వదిలేసి ద్విచక్ర వాహనంపై నర్సాపూర్ (జి) వస్తుండగా అర్లి ఎక్స్ రోడ్ దాటిన తర్వాత 61వ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య అంజుం బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

కోడిగుడ్లు నాసిరకం..?

- అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా
- సెలవుల నేపథ్యంలో ఇంటికే సరుకులు
- పాడైనవి వస్తున్నాయంటున్న లబ్ధిదారులు



నీటిలో తేలుతున్న గుడ్లు

మంచిర్యాలటౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడిగుడ్లు అందజేస్తోంది. మూడేళ్ల పైబడిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పప్పు, ఆకుకూరలు, కోడిగుడ్డుతో కూడిన మధ్యాహ్నం భోజనం చేస్తుండగా.. మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం ఇంటికే ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల వేసవి సెలవుల కారణంగా పౌష్టికాహారాన్ని నేరుగా లబ్ధిదారులకే ఇస్తున్నారు. కోడిగుడ్లు ఇంటికి తీసుకెళ్లి మంచివో కావో తెలుసుకునేందుకు నీటిలో వేయగా తేలుతున్నాయి. పగులగొట్టి చూస్తూ పాడై ఉంటుండడంతో పడేస్తున్నారు. సగానికి పైగా పాడైనవి ఉంటున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నాసిరకం కోడిగుడ్లు, తక్కువ బరువు ఉన్నవి, నిల్వ కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్ నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకే గుడ్లు సరఫరా చేస్తుండగా.. నిబంధనల ప్రకారం ఉన్నవాటినే టీచర్లు తీసుకోవాల్సి ఉంటుంది. కోడిగుడ్ల సరఫరాలో జిల్లా వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక గుడ్డు కనీస బరువు 50గ్రాములు ఉండాలనే నిబంధన ఉంది. కానీ ఒక ట్రేలో 30కోడిగుడ్లు ఉంటే అందులో ఐదు నుంచి పది ఎక్కువ బరువు ఉన్నవాటిని ఉంచి మొత్తం ట్రే బరువు 1500 గ్రాములకు దగ్గరలో ఉండేలా చూస్తున్నారు. కచ్చితంగా బరువు చూసి తీసుకునే టీచర్లు ఉన్నచోట ఈ విధానం అమలు చేస్తుండగా.. ప్రశ్నించని వారి కేంద్రాలకు బరువుతో సంబంధం లేకుండా చిన్న పరిమాణంలో ఉన్నవి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న వాటిని సరఫరా చేయడం వల్ల ఉడకబెట్టే సమయానికి లోపల చెడిపోయి దుర్వాసన వస్తుండడంతో బయట పడేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందడం లేదు.

జిల్లా వివరాలు		
అంగన్‌వాడీ కేంద్రాలు	:	969
గర్భిణులు	:	4.245
బాలింతలు	:	3,186
చిన్నారులు	:	45,455

చిన్నగుడ్లను తిరిగి ఇచ్చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించినప్పుడు చిన్న పరిమాణంలో కోడిగుడ్లు ఉంటే వెనక్కి పంపించి మళ్లీ తెప్పిస్తున్నాం. అంగన్‌వాడీ టీచర్లు చిన్న వాటిని, పాడైనవి ఉంటే తీసుకోవద్దని చెబుతున్నాం. ఎవరైనా చిన్నసైజువి, నాణ్యత లేనివి తీసుకుంటే చర్యలు తీసుకుంటాం.

– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

ఉపాధి హామీ కూలీకి గాయాలు

జన్నారం: మండలంలోని రేండ్లగూడకు చెందిన తీగల పద్మ శనివారం ఉపాధి హామీ పనికి వెళ్లి వస్తుండగా బండ తగిలి కిందపడటంతో కాలు విరిగింది. గమనించిన తోటి కూలీలు జన్నారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై ఉపాధి హామి ఏపీఎం రవీందర్‌ను సంప్రదించగా ఆస్పత్రి ఖర్చులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నా రు.

బావిలోపడి యువకుడు..

సారంగాపూర్: మద్యం మత్తులో బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బర్కుంట రవి (30) శుక్రవారం మహబూబా ఘాట్స్ సమీపంలోని శేక్ సాహెబ్ దర్గా వద్ద బంధువులు చేసిన పండుగకు హాజరయ్యాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఘాట్స్ సమీపంలో వెతుకుతుండగా బావిలో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



రవి (ఫైల్)

పాము కాటుతో మహిళ..

కౌటాల: మండలంలోని గుండాయిపేటకు చెందిన దుర్గం ప్రియత (26) శుక్రవారం రాత్రి పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. మృతురాలు ప్రియత ఇంటి ఆవరణలో పనిచేస్తుండగా పాము కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిర్పూర్(టి)లోని సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని శనివారం ఎస్సై పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. మృతురాలి భర్త దుర్గం ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రియత (ఫైల్)

ఉత్తమ ప్లాంటేషన్ వాచర్‌గా సాయికిరణ్

జైపూర్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ)లో పనిచేస్తున్న ఎ.సాయికిరణ్ ఉత్తమ ప్లాంటేషన్ వాచర్‌గా ఎంపికయ్యాడు. టీజీఎఫ్‌డీసీ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో డివిజన్ల వారీగా ప్రకటించిన జాబితాలో కాగజ్‌నగర్ డివిజన్ మంచిర్యాల రేంజ్ నుంచి సాయికిరణ్ ఎంపికయ్యాడు. 10 సంవత్సరాలుగా ప్లాంటేషన్లను రక్షిస్తూ ఉత్తమ పనితీరు ప్రదర్శిస్తున్నందుకుగానూ ఈ అవార్డు అందుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రావణి చేతుల మీదుగా ప్రశంసపత్రంతో పాటు రూ.5వేల నగదు బహుమతి అందుకున్నారు. శనివారం మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, సిబ్బంది అభినందించారు.



ప్రశంసపత్రం అందుకుంటున్న సాయికిరణ్

ఉమ్మడి జిల్లాలో నాయబ్ తహసీల్దార్ల బదిలీ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న 14 మంది నాయబ్ తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. గత ఎన్నికల నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న వారిని సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉమ్మడి జిల్లా అధికారులు ఇక్కడికి రానున్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీస్థానం
జాడి జోగయ్య	మంచిర్యాల	కుమురంభీం ఆసిఫాబాద్
పి.రవీందర్	మంచిర్యాల	పెద్దపల్లి
టి.రాజేశ్వర్‌రావు	మంచిర్యాల	పెద్దపల్లి
బైరెడ్డి స్వప్న	పెద్దపల్లి	మంచిర్యాల
బి.సంతోష్	పెద్దపల్లి	మంచిర్యాల
బి.విజయ్‌కాంత్‌రావు	ఆదిలాబాద్	నిజామాబాద్
అబ్దుల్ అజీజ్	నిర్మల్	నిజామాబాద్
దీపారాణి	నిర్మల్	నిజామాబాద్
జి.రంజీత్ కుమార్	నిర్మల్	నిజామాబాద్
మునీరుద్దీన్	నిర్మల్	నిజామాబాద్
వి.గంగాధర్	నిజామాబాద్	నిర్మల్
ఎం.తెలంగ్‌రావు	నిజామాబాద్	నిర్మల్
జె.ప్రకాశ్	నిజామాబాద్	నిర్మల్
బాబుసింగ్	నిజామాబాద్	నిర్మల్
వి.హన్మంతరావు	జగిత్యాల	మంచిర్యాల
డి.రోహిత్	కుమురంభీం ఆసిఫాబాద్	మంచిర్యాల
కే.వై.ప్రసాద్	మంచిర్యాల	పెద్దపల్లి